# రుణం

''అమ్మా! మన పక్క పోర్షన్లోకి ఈ రోజు కొత్త వాళ్ళు వస్తారట'' అంది శ్రీదేవి తల్లికి పెద్ద విశేషం చెప్తున్న ధోరణిలో.

అన్నపూర్ణ కూరలు తరుగుతోంది. ఏం మాట్లాడలేదు.

''జ్యోతి వాళ్ళు ఎంతమంచి వాళ్ళో?! వాళ్ళెళ్ళిపోయాక సందడే లేదు. ఆవచ్చే శాల్తీలు ఎలా వుంటాయో ఏమో'' అంది శ్రీదేవి మళ్ళీ తనే.

''ఇల్లు చూసుకోటానికొచ్చినప్పుడు చూశాను. చిన్న కుటుంబం, భార్యా, భర్తా ఒక కొడుకు అంతే'' అంది అన్నపూర్ణ.

''ఓహో చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమా. సర్లే బాబు ముద్దుగా వున్నాడా?'' అడిగింది శ్రీదేవి.

''ముద్దుగా, బొద్దుగా అంటావేందమ్మా. ఎద్దులా వుంటేనూ'' అంది పనిపిల్ల అంట్లుతోముతూ.

''పెద్దవాడా!'' నీరసంగా అంది శ్రీదేవి.

ఇంతలో తలుపు మోగితే శ్రీదేవి వెళ్ళి తలుపు తీసింది.

ఓ యువకుడు, ''కొబ్బరికాయ కొట్టటానికి రాయి కావాలండీ'' అని అడిగాడు, వచ్చింది ఆడపిల్ల అని గ్రహించి పక్కచూపులు చూస్తూ.

శ్రీదేవికి అడక్కుండానే అర్థమయింది అతడెవరో. చక్కగా హిందీ సినిమా హీరో మిథున్ చక్రవర్తిలా వున్నాడు చూట్టానికి. పక్క చూపులు చూసే అతన్ని ఉడికించాలనిపించింది ఆమెకు.

''కొబ్బరికాయ కొట్టటానికి రాయెందుకండీ, నేలమీద కొట్టొచ్చుగా'' అంది.

''అవుననుకోండి, గచ్చు పాడయిపోతుందేమోనని...'' అని నసిగాడతను.

''రుబ్బురోలు తెచ్చిచ్చేదా?''.

''ఏదో ఒకటి ఇవ్వండి.''

శ్రీదేవి లోపలకు వెళ్ళి రాయితెచ్చి ఇచ్చింది.

తర్వాత కొంతసేపటికి అతని తల్లి ప్రసాదం ఇవ్వటానికి వచ్చి తనని తాను పరిచయం చేసుకుంది. భర్త మిలటరీలో పనిచేసి రిటైరు అయ్యాడనీ, కొడుకు ఎం.ఏ చదువుతున్నాడనీ చెప్పింది. ఇంకా అన్నది ఆమె, ''మా వాడికేమో ఎప్పుడు ఉద్యోగమొస్తుందా అని ఆలోచన. వాళ్ళ నాన్నగారేమో సంపాదించే రోజులు చాలా వున్నాయి. ముందు చదువుకోరా అంటారు. పోనీ చదువు బుర్ర కెక్కదా అంటే అదేం లేదు, ఫస్టు క్లాసులో పాసవుతాడు.''

'సహజంగా ఏ తల్లయినా తమ పిల్లల గురించి వేరే వాళ్ళముందు గొప్పగా చెప్పుకుంటుంది కదా!' అనుకుంది శ్రీదేవి. అయితే ఆమె మాటలు అక్షరసత్యాలనీ, ఇంకా అతని తల్లి రుక్మిణి చెప్పని గొప్ప లక్షణాలు చాలా అతనికి వున్నాయనీ ఆమె త్వరలోనే గ్రహించింది. అతను తెలివైనవాడు, బుద్ధిమంతుడు. రోజూ ప్రొద్దున్నే పూజకూడా చేస్తాడట. ''పెద్దలంటే మన్నన, దేవుడంటే భక్తి ప్రపత్తులున్న కుర్రవాడ''ని శ్రీదేవి తల్లి అన్నపూర్ణ కూడా ఓ యోగ్యతా పత్రం ఇచ్చింది అతనికి. పర్వదినాల్లో తల్లీ తండ్రితో కలిసివెళ్ళి గుడిలో పూజ కూడా చేయించుకుని వస్తాడట. ''మన అమ్మాయీ వుంది ఎందుకు దండగ. పొద్దున ఏడింటికి, పదిసార్లు కేకలేస్తేగాని దానికి మెలకువరాదు. ఆ పిల్లవాడు చూడండి? పొద్దున్నే లేచి, దేవుడి పూజ చేసుకుని, పుస్తకాలు ముందేసుకు కూర్చుంటాడు. మరి అన్ని క్లాసుల్లోనూ ఫస్టున పాసయ్యాడంటే వూరికే పాసయ్యాడా?'' అందోసారి అన్నపూర్ణ భర్తతో.

'అహా... అయితే 'రురో' రుబ్బురోలు పత్రమన్నమాట. పుస్తకాలు రుబ్బేసి తినేస్తాడు కాబోలు' అనుకుంది శ్రీదేవి.

''అవును కుర్రాడు మర్యాదస్థుడులాగనే వున్నాడు. మొన్న ఆదివారం బస్సు దిగి కూరల సంచీలు భారంగా మోసుకొస్తున్నానా? శంకరం కూడ నాతోనే బస్సు దిగాడు. 'అయ్యో అంకుల్ రెండు సంచులు మీరేం మోస్తారు. నాకోటి ఇవ్వండి నేను తెస్తాను' అని నేనడక్కుండానే నాచేతిలో సంచీ తీసుకుని ఇంటిదాక తీసుకొచ్చాడు'' అన్నాడు ఆయన భార్య మాటలకు తాళంవేస్తూ.

మహిళా సమాజం వారుకూడ ఏకగ్రీవంగా అతని మంచితనం, మర్యాద, వినయవిధేయతల పట్ల హర్షించి ప్రశంసా పత్రాన్ని బహూకరించారు. ఆరోజు శెలవు కావటాన శ్రీదేవి ఇంట్లోనే వుంది. భోజనాలయింతర్వాత అమ్మలక్కలందరూ ఆమె ఇంట్లో సమావేశమయ్యారు.

''మావాడికి అతి సిగ్గండీ, ఆడ పిల్లలతో అయితే అసలు మాట్లాడనే మాట్లాడడు'' అంది రుక్మిణి మాటల సందర్భంలో కొడుకుని గూర్చి చెప్పుకుంటూ.

''ఏ మాట కామాట చెప్పుకోవాల్సిందే. మీ శంకరం మహా బుద్ధిమంతుడు. వంచిన తల ఎత్తకుండా తన మానాన తను పోతుంటాడు'' అంది ఎదురింటి వెంకటలక్ష్మి. ఆమెకు ఎదిగిన కూతుళ్ళు ముగ్గురున్నారు. ఆమె భయం ఆమెది. కులంకాని కుర్రవాణ్ణి ప్రేమించి తన కూతుళ్ళెక్కడ చెడిపోతారోనని ఆమె జాగ్రత్త.

''ఆ మాట నిజం. ఈ కాలపు పోకిరీ కుర్రకారు వయస్సు కూడా చూడరు. ఆడది కనపడ్తే ఎగాదిగా చూట్టమే'' అంది ముప్పయ్యేళ్ళున్న మీనాక్షి. అసలామె బాధ... తన్నెవరూ చూడరే మని, మనిషి పొట్టిగా గుమ్మటంలా ఉంటుంది.- అయితే తానందగత్తెనేనని ఆమె అభిప్రాయం. అలాంటి అభిప్రాయాలు లోకంలో అందరికీ కలగకపోవటమే ఆమె జీవితంలోని పెద్ద ట్రాజెడీ.

''ఈ కాలంలో అలాంటి పిల్లలుండటం అరుదు. సినిమాలకుక్కూడా పోడటగా మీశంకరం'' అంది వీధిలో మూడో ఇంటి ముక్కంటి భార్య మరుద్వతి. ఆమె కొడుకు, కూతురు కొత్త సినిమా వస్తే వదిలిపెట్టరు.

''అసలు మా ఇంట్లో సాధారణంగా సినిమాల కెళ్ళమండీ, వాడికీ అదే అలవాటు'' అంది రుక్మిణి.

పక్కగదిలో దీక్షగా సినిమా పత్రిక చదువుతూన్న శ్రీదేవి అధ్యయనానికి అవాంతరమేర్పడింది. పుస్తకం పక్కన పెట్టి వాళ్ళ మాటలు విన్న ఆమెకు వళ్ళు కంపరం కలిగినట్లయింది. 'సినిమాలు చూడడు, గుడికివెళ్తాడు. పూజలు చేస్తాడు, చదువులో ఫస్టు, కనీసం సిగరెట్టన్నా కాల్చడు. ఛీ... ఛీ... ఏడేం మనిషి. ఈ మనిషిని చెరచాల్సిందే' అన్న నిర్ణయానికొచ్చింది శ్రీదేవి.

ఆమె బి.ఏ. సెకండియర్ చదువుతోంది. తెలివితేటలకేం తరుగులేదుగానీ పుస్తకం తెరిస్తే నిద్రొస్తుంది ఆమెకు. అయినా ఏ పరీక్షా తప్పకుండా అత్తెసరు మార్కులతో పాసవుతూ వుండేది. చదువుకంటే ఆటలంటే ఆమెకిష్టం. ఫుట్‌బాల్ ఛాంపియన్ ఆమె. కళాశాల క్రీడల్లో పాల్గొనటమే కాక ప్రతిరోజూ వై.డబ్ల్యు.సి.ఏ.కి వెళ్ళి ప్రాక్టీసు చేస్తుంటుంది. 'ఈ రురోకు... బుద్ధావతారానికి స్పోర్ట్స్‌లో ఇంట్రెస్ట్ వున్నట్లు లేదు' అని ఆమె గమనించింది.

ఒకటి రెండు సార్లు వాళ్ళ ఇంటికి వెళ్ళి రుక్మిణితో మాట్లాడేటప్పుడు, అతనక్కడ వుంటే అతనితోనూ మాటలు కలుప ప్రయత్నించింది కానీ, అతను ముక్తసరిగా మాట్లాడటంతో ఎలా అతని పరిధిలోకి చొచ్చుకు పోవాలా అని తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది శ్రీదేవి.

బి.ఏ.లో ఆమె గ్రూపు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్. శ్రద్ధ లేని ఆమెకు అన్ని సబ్జక్టులు ఒకే రకంగా వుంటాయి కానీ, ఎకనామిక్స్ మరీ అగమ్యగోచరం. అందువల్ల ఓ రోజు రుక్మిణి దగ్గరకు వచ్చి, ''ఆంటీ మీ అబ్బాయి చేసేది ఎం.ఏ. ఎకనామిక్సేకదా. నాకా సబ్జక్ట్ అర్థం కావటంలేదు. కొంచెం చేప్తారేమో మీ అబ్బాయిని కనుక్కుంటారా?'' అంది.

''దాందేవుందమ్మా అలాగే చెప్తాడులే'' అని ''అరె బాబూ! ఈ అమ్మాయి కేంటో తెలీటం లేదట చెప్పరా'' అంది అతని గదిలోకి వస్తూ.

''నాకెక్కడ తీరుతుందమ్మా?'' అన్నాడతను పుస్తకంలో నుండి తల పైకెత్తి.

'ఆ నీకెందుకు తీరుతుంది రుబ్బటం తప్ప' అనుకుంది శ్రీదేవి.

''అట్లా అంటే ఎట్లా? ఇరుగు పొరుగు వాళ్ళం. ఒకళ్ళకొకళ్ళు సాయం చేసుకోపోతే ఎట్లా?'' అంది రుక్మిణి.

తల్లి మాటను కాదనలేక 'సరే' నన్నాడు శంకరం. కూర్చోమని ఆమెని ప్రశ్నించసాగాడు. 'డిమాండ్' అంటే ఏమిటి? 'సప్లయ్' అంటే ఏమిటి? 'సర్ప్లస్' అంటే ఏమిటి? అని.

''అవన్నీ తెలవకేగా మీ దగ్గరకు వస్తా'' అంది శ్రీదేవి.

''బేసిక్స్ తెలియకుండా రెండో ఏడు ఏం చదువుతున్నారు?'' అడిగాడతను.

''అదేంటిరా, ఆ అమ్మాయి తెలీదో అని మొత్తుకుంటుంటే, ఏం చదవావని అడుగుతావు. తెలిసేటట్లు చెప్పు'' అని వంటింట్లోకి వెళ్ళింది రుక్మిణి. తన కొడుకు బుద్ధిమంతుడు, చదువుల సరస్వతి అని ఆమె ఉద్దేశం. ఎవరయినా 'మాకిది తెలియదు చెప్పండి' అని కొడుకు దగ్గరకు వస్తే ఆమెకు గర్వం. అలాంటి కొడుకును కన్నందుకు ఇరుగు పొరుగుల్లో తనకెంత పేరు?!.

''మీకు బేసిక్స్ నుండి చెప్పాలంటే ఒక్క రోజులో పూర్తికాదు'' అన్నాడు.

''ఒక్కరోజులో ఎవరు చెప్పమన్నారు? రోజూ చెప్పండి.''

''మరి నా చదువు...?''

''మీ చదువుకేం నష్టం కాదులేండి, నాకోగంట పాఠం చెప్పినందువల్ల.''

మరేమనలేక అతనుపాఠం మొదలు పెట్టాడు. ఆమె అతని వంక చూస్తూ వింటోంది. తన వంక సూటిగా చూడక గోడవంక చూస్తూ చెప్పే అతని పాఠం ఆమెకు నచ్చలేదు. ఓ అరగంట అయినతర్వాత, ''ఇవాల్టికి చాల్లేండి, నే చెప్పింది అర్థమయిందా?'' అని అడిగాడు...

''అయినట్టే వుంది'' అని ''మరిరేపు వచ్చేదా?'' అని అడిగింది లేస్తూ.

''సరే రండి'' అన్నాడతను.

శ్రీదేవి రోజూ రాసాగింది. ఆమెకు పాఠం వినటం బోరు. అందుకని అతని ముఖం వంకే చూస్తూవుండేది, అతను పాఠం చెప్తున్నంత సేపూ.

''ఇప్పుడు చెప్పండి డిమాండ్ కర్వ్‌గ్రాఫులో గీస్తే ఎలా వస్తుందో'' అని అడిగాడతను.

''ఏమో?'' అంది ఆమె.

''ఏమో ఏంటి? నే చెప్పేది వింటం లేదా?''

''అబ్బ! ఎప్పుడూ పాఠం గొడవేనా, ఇంకేమయినా చెప్పరాదూ?'' అంది ఆమె.

''ఇంకేం చెప్పాలి?'' అన్నాడతను తలెత్తి ఆమె వంక ఆశ్చర్యంగా చూస్తూ.

అతన్నిచూస్తే జాలికలిగింది ఆమెకు. 'పర్సనాలిటీ మిథున్ చక్రవర్తిలా వున్నా కొంచెం కూడ

మానసికమైన ఎదుగుదల లేదే ఇతనిలో. ఆడపిల్ల పక్కనుంటే సరసం, సరాగం లేకపోతే పోనీ కనీసం ఓ చిరునవ్వయినా నవ్వడే, ఇదేం జడ పదార్థం' అనుకుంది శ్రీదేవి.

''స్పోర్ట్సుపై మీ అభిప్రాయం ఏమిటి?'' అంది పైకి.

''మీరు ఆటలు ఆడ్తారా?''

''ఆడటమేంటి? మా కాలేజీ ఉమెన్స్ ఫుట్ బాల్ టీంకి నేనే క్యాప్టన్ని. మీకు స్పోర్ట్స్ అంటే ఇష్టంలేదా?''

''ఆటలకీ మనకీ ఆమడ దూరం.''

''అదేం.''

''అవి మన ఒంటికి పడవులేండి. ఇంతకీ పాఠం వింటారా లేదా?''

''రోజూ వింటూనే వున్నాగా, ఇవ్వాళ ఇంకేదయినా చెప్పండి.''

''నాకు మీతో కబుర్లు చెప్పే తీరికలేదు. రేపు ఆదివారం నాకు బ్యాంక్ టెస్టుంది, చదువుకోవాలి.''

''మీది రివర్స్ కేసులా వుంది. స్పోర్ట్స్ ఆరోగ్యానికి మంచిదంటారు అంతా. పోనీ ఛెస్ ఆడదామా?''

''ఊహూ నేను చదువుకోవాలి.''

''అబ్బబ్బ! చదివేచదువు, చాలుగానీ. ఇవ్వాల్టికొక్కరోజు చదరంగం ఆడ్దాం.''

''ప్లీజ్ నన్ను విసిగించకండి'' అని లేచి వెళ్ళిపోయాడు శంకరం.

తన కోరికను నిరాకరించినందుకు కోపం రాలేదు శ్రీదేవికి. పైగా 'ఎంత తపస్వి?' అనుకుంది ఆమె మనసులో. 'చెడపకురా చెడేవు' అన్న బుధ వాక్యం పెడచెవిన బెట్టి శంకరాన్ని మళ్ళించ ప్రయత్నించిన శ్రీదేవి అతడి ఆరాధనలో పడిపోయింది. ఆరోజు ఆమె తన డైరీలో రాసుకుంది. ''కాలేజీలో ఎందరో మగపిల్లలు నాతో మాట్లాడాలనీ, పరిచయం పెంచుకోవాలనీ ఆరాట పడుతుంటారు. కానీ నాయీ మొద్దు 'రురో' అందరి మొగవాళ్ళ లాంటి వాడు కాదు. నేనొక ఆడపిల్లననే విషయమే అతనికి తోచదసలు. ఎంత చొరవనిచ్చినా పొరపాటున కూడ సభ్యతను మర్చిపోని 'జడ పదార్థం'. పుస్తకాలే అతడి ప్రపంచం. వేరే వాళ్ళ విషయంలో జోక్యం చేసుకోడు. ఏ దురలవాటూ లేదు. అతడు నాకెంతో నచ్చాడు. ఈ మొద్దును చేసుకునే మానిని ఎన్ని నోములు నోచినదయి వుంటుందో కదా! అదే నేనయితే...'' సిగ్గు ముంచుకొచ్చి ఆపైన డైరీ మూసేసింది శ్రీదేవి.

'రురో' అనీ 'జడపదార్థం'అనీ, 'మొద్దు' అనీ ముద్దుముద్దుగా సంబోధించు కోసాగింది. ఇహ ఆ బండరాయిని కదిలించటం యుద్ధ ప్రాతిపదిక మీద సాగించాలని నిర్ణయించుకుంది.

మర్నాడు పాఠానికొచ్చి, అతను పాఠం మొదలెట్టే లోపలే అంది ''రాత్రి నాకో కల వచ్చింది'' అని.

అతను ఆమె వంక విచిత్రంగా చూశాడు.

''వింటున్నారా 'రురో'గారూ!'' అంది.

'''రురో' ఏమిటి?'' అన్నాడతను అయోమయంగా.

''షార్ట్ ఫర్ 'రుబ్బురోలు పాత్రం.' పుస్తకాలు రుబ్బేస్తారుగా, అందుకని ముద్దుగా 'రురో' అని పేరెట్టాను. ఎలా ఉంది?'

''నా ముఖంలా వుంది.''

'' మీ ముఖానికేం చక్కగా వుంది. సరే విన్నారా? నాకు రాత్రి కలవచ్చింది.''

''అయితే ఏమిట్ట? పాఠానికీ మీ కొచ్చిన కలకీ ఏం సంబంధం?''

''అదేనా ప్రశ్నించే తీరు? ఏం కలొచ్చిందో అడగ్గాడదూ?'' అంది ఆమె బుంగమూతి పెట్టి.

''సరే ఏం కలొచ్చింది?''

''కలలో మీరు పాఠం చెప్తున్నారట. అబ్బ! ఎంత బావున్నారు కలలో మిథున్ చక్రవర్తిలా వున్నారు! పాఠం చెప్తూ చెప్తూ ఆపేసి నావంకే చూస్తున్నారట. చూస్తూ, చూస్తూ.... ఛీఫో నాకు సిగ్గేస్తోంది.''

''మనం పాఠం చెప్పుకుందామా?''

''అబ్బ! దరిద్రపు పాఠం ఎప్పుడూ వుండేదే. ఎంతో ముఖ్యమైన విషయం చెప్తుంటే పానకంలో పుడకలా 'పాఠం, పాఠం' అని గోల పెడ్తారు? అసలు మీకు మనసుందా అని?'' అని గయ్యిమంది శ్రీదేవి.

''సరే చూస్తూ, చూస్తూ.... ఏం చేశాను?''

''ముద్దు పెట్టుకున్నారట. ఛ... 'ఆడపిల్ల కన్పిస్తే మీకిదేం బుద్ధి' అని మిమ్మల్ని ఓ తోపు తోశానట. అయినా అదేం బుద్ధి మీకు?''

''బావుంది నేనేం చేశాను?''

''నాగోల అదే ఏం చేయలేదని. నేనలా తోశానా, మీరు నా చెయ్యి పట్టుకు మీదకు లాక్కున్నారట. 'వదలండి, వదలండి' అని నేనరిచానట'' అంది శ్రీదేవి పెద్దగా.

''మెల్లగా చెప్పండి మా అమ్మ వింటే నిజంగానే నేను మీ చెయ్యి పట్టుకున్నాననుకుంటుంది.''

''అనుకోనీండీ, మీరు చెయ్యగా లేంది, ఆమె అనుకుంటేనేం?''

''నేనెప్పుడు మీ చెయ్యి పట్టుకున్నాను?''

''పట్టుకోకేం పట్టుకున్నారు. ఉండండి మీ అమ్మని పిల్చి చెప్తాను.''

''అమ్మో! ఇదెక్కడి తంటా తెచ్చి పెట్టారు. పుట్టి పుణ్యానికి నన్నల్లరి పెట్టేస్తున్నారు'' అని గోల పెట్టాడు శంకరం. 'రేప్' చేసినంతగా బాధపడిపోయాడతను.

''మరయితే నేను చెప్పినట్టు వింటే మీ అమ్మకు చెప్పను.''

''చెప్పండి. ఏం చేయాలి?''

''రేపు నాతో సినిమాకు రావాలి.''

''రేపు నేను మీతో - ఓ ఆడపిల్లతో సినిమాకు రావాలా? అమ్మో ఇంకేమయినా వుందా?'' అన్నాడు శంకరం, బలవంతంగా ఆమె తన చేత కాని పని చేయిస్తున్నట్లు, అతని మొహం దిగాలు పోయింది.

''సరే అలాయితే, ఆంటీ, ఆంటీ...'' అని పెద్దగా పిలవసాగింది శ్రీదేవి. వంటింట్లో వున్న రుక్మిణికి కుక్కర్ మోతలో తన పిలుపు విన్పడదని ఆమెకు తెల్సు. అయితే గాబరాలో ఉన్న శంకరం ఆ సంగతి గ్రహించే స్థితిలో లేడు. తన చెయ్యి ఆమె నోటికి అడ్డం పెట్టి ఆమెను ఆప ప్రయత్నించాడు.

''ఆడపిల్లల్ని తాకొచ్చా?'' అంది ఆమె అతని చెయ్యిపక్కకు తోస్తూ.

''తాక్కూడదు.''

''ఏం వాళ్ళు తాకరాని వాళ్ళా?''

''అని కాదు...'' అని నసిగాడు అతను ఆమెకేం సమాధానం చెప్పాలో తోచక బుర్ర గోక్కుంటూ.

''మరి రేపు సినిమాకు వస్తారా? లేక మీ విషయం ఆంటీకి చెప్పేదా?''

''వద్దు వద్దు వస్తానుగా'' అన్నాడతను నీరసంగా.

''ఏమిటంత నీరసం. హుషారుగా చెప్పలేరూ?''

''ఇంకెలా చెప్పాలి?'' అన్నాడు అతను దీనంగా.

అతని ముఖాన్ని చూసిన ఆమెకు చిర్రెత్తుకొచ్చింది.

''అంత ఇష్టం లేకుండా మీరు సినిమాకు రానవసరం లేదు. అసలు మీలాంటి జడపదార్థాన్ని అడగటం నాదే బుద్ధి తక్కువ'' అని లేచి కోపంగా వెళ్ళిపోయింది శ్రీదేవి.

'బతుకు జీవుడా' అనుకున్నాడు శంకరం.

శ్రీదేవి యుద్ధ ప్రాతిపదిక మీద తన కార్యక్రమాన్ని చేపట్టటానికి కారణం ఉంది. శంకరానికి బాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసరుగా ఉద్యోగమొచ్చింది. బెంగుళూరులో అతని పోస్టింగ్, ఇంకోవారం

రోజుల్లో వెళ్ళిపోతాడతను. అందువల్ల అతనిలో స్పందన కలిగించాలనే చివరి ప్రయత్నాన్ని చేపట్టింది ఆమె. శ్రీదేవి వచ్చేటప్పటికి శంకరం న్యూస్ పేపరు చదువుతున్నాడు. చేతిలో వున్న బంతిని నేలకేసి కొడ్తూ వచ్చిందామె. బంతితో అలానే ఆడ్తూ, ''ఆంటీ, ఆంటీ'' అని పిల్చింది.

రుక్మిణి ఆ పరిసరాల్లో లేదు. పలకలేదు.

''కూర్చోండి, అమ్మా నాన్నా బజారుకెళ్ళారు, కూరలు తేవటానికి'' అన్నాడు శంకర్.

శ్రీదేవి బదులు చెప్పలేదు, కూర్చోలేదు, వెళ్ళి టి.వి ఆన్ చేసింది.

''టి.వి. ఆఫ్ చేయండి, ప్లీజ్ డోంట్ డిస్టర్బ్‌మి'' అన్నాడతను.

ఆమె టి.వి.ని తీసేయలేదు, బంతితో ఆడటం మానలేదు.

''ప్లీజ్ శ్రీదేవిగారూ!'' అన్నాడతను ప్రాధేయపడ్తూ.

ఆమెకి వళ్ళు మండి పోయింది. 'ఏం... పేపరు తనకంటే ఎక్కువా? ఏం వుంటుందా పేపరులో, అంత ఆసక్తి కలిగించే విషయం?' ఆమె కోపంగా చివ్వున అతనివైపు తిరిగి అంది.

''చిన్నవాళ్ళను కూడా 'గారు, గీరు' అని మర్యాద చేస్తూ అవమానం చేయటం మీకు బావుందా?'

''మరేమనాలి?''

''చక్కగా శ్రీదేవీ అని పిలువలేరూ?''

''సరే''

''సరే కాదు, అలా పిలవండి ఓ సారి''

''శ్రీదేవీ!'' అన్నాడతను సిగ్గుపడిపోతూ.

''దట్స్‌గుడ్'' అంది టి.వి. ఆఫ్ చేసినా, బంతితో ఆడ్తూనే.

''అస్తమానం ఆటలే, వేరే పని లేదా? ఔను.. పబ్లిక్ సర్వీస్ కమీషనో, స్టాఫ్ సెలక్షనో ఏదో ఒకటి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి రాయకూడదూ?'' అన్నాడతను సలహా ఇస్తూ.

''నేను రాయను.''

''అదేం''

''తమరు సలహా ఇచ్చారు కనుక.''

అతని కామెతో ఇంకేం మాట్లాడాలో తోచక మళ్ళీ పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

''చదివితే సరిపోదేమో, రుబ్బి తినరాదూ? మనుషులతో కాకుండా కాగితాలతో కాలక్షేపం చేసే మిమ్మల్నే చూశాను'' అంది ఆమె ఆట ఆపి సోఫాలో కూర్చుంటూ.

పేపరు పక్కన పెడ్తూ, ''సరే చెప్పు'' అన్నాడు.

''చెప్పు లేదూ, బూటూ లేదు, బెంగుళూరు వెళ్తున్నారుగా మీరే చెప్పండి ఏమయినా'' అందామె.

''ఏం చెప్పాలి?''

''నా మొహం. అయితే నేనే చెప్తాను. షాకింగ్ న్యూస్. వినండి నాకు...'' అంటూ శ్రీదేవి వాక్యం పూర్తిచేయకముందే.

''ఉద్యోగం వచ్చిందా!'' అని మధ్యలోనే అడిగాడు శంకరం.

''హేయ్ రాం! మిమ్మల్నా దేవుడు కూడా బాగుచేయలేడు. చదువు, ఉద్యోగం తప్ప వేరే ఆలోచనలే వుండవా మీకు?''

''సర్సరే ఏమయిందో చెప్పు'' అన్నాడు అతను కంగారుపడ్తూ.

''నాకు పెళ్ళి సంబంధం ఖాయం చేస్తున్నారు.''

''వెరీ గుడ్ న్యూస్. కంగ్రాట్స్'' అన్నాడతను సంతోషంగా.

''కంగ్రాట్సు చెప్తున్నారా నాకు?'' శ్రీదేవి ముఖంలో నిరాశ, నిస్పృహ చోటుచేసుకున్నాయి.

''మరేం చేయాలి?''

''షూట్ చేయాలి''

''ఎవర్ని?'' అన్నాడతను ఆశ్చర్యపోతూ.

''నన్ను''

''ఎందుకు?''

''మీకు తెలీదా?'' కోపంగా అడిగింది శ్రీదేవి.

''బావుంది. నాకెలా తెలుస్తుంది. మతేంభ్రమించలేదు కదా!'' అన్నాడతను జోక్ చేస్తున్నట్లు.

''మతి కాదు, మనసు భ్రమించినందుకు ఒకరి చుట్టూ.''

''అంటే''

''నేనో వ్యక్తిని చేసుకోవాలను కున్నాను.''

''అట్లాగా'' అని ఏమాత్రం కుతూహలం లేకుండా అంటున్న అతని వంక హతాశురాలై చూసింది శ్రీదేవి.

'ఎవర్ని ప్రేమించావు. ఎవర్ని చేసుకోవాలనుకున్నావు?' అని అడగడేం ఈ 'రురో' అనుకుంది ఆమె.

అంతలో అతని తల్లీదండ్రీ రావటంతో 'వస్తా'నని చెప్పిబయట పడింది శ్రీదేవి.

శంకరం హైదరాబాదులో వున్న వారం రోజులూ కాలు కాలిన పిల్లిలా వాళ్ళింటి చుట్టూ తిరుగుతూనే వుంది శ్రీదేవి. శంకరం వంటరిగా దొరకటమే అరుదయి పోయింది. వంటరిగా దొరికినా ఎందుకూ పనికిరాని వాడయాడు. 'రుబ్బురోలు' తన పరిధిలో తిరగటమే తప్ప పక్కకు పోదు. అతడూ అంతే చదువు, ఉద్యోగం, పెళ్ళి... పెళ్ళికూడ తల్లిదండ్రులు కుదిర్చి చేసిందే. 'అసలు స్పందనే లేదు మనిషిలో, పెళ్ళి చేసుకున్న భార్యనయినా ప్రేమతో దగ్గరకు తీసుకుంటాడా ఇతను' అనుకుంది శ్రీదేవి.

తన్ను ప్రేమించానని చెప్పి, తనతో శారీరక సంబంధం పెట్టుకుని, చివరకు మోసం చేసి వెళ్ళి పోయినా ఆమె అతన్ని క్షమించగలిగేది కాని, అసలు స్పందనేలేని ఈ 'రురో'ను, బండను, పనికిమాలిన బుద్ధిమంతుణ్ణి ఆమె ఎప్పటికీ క్షమించలేదు.

బెంగుళూరు వెళ్ళబోయే ముందు శ్రీదేవి వాళ్ళ ఇంటికి వచ్చి అందరికీ పేరు పేరునా చెప్పి, శ్రీదేవికి ఓ పుస్తకము ప్రెజెంట్ చేసి ''వస్తాను శ్రీదేవీ! విష్‌యూ ఆల్ది బేస్ట్'' అని వెళ్ళిపోయాడు అతను. 'కనీసం స్టేషనుకు రమ్మనైనా అనలేదు జడుడు' అనుకుంది ఆమె. అతను వెళ్ళగానే, వీధిలోకి వచ్చి, ఎవరూ చూడకుండా అతను ప్రెజంట్ చేసిన పుస్తకాన్ని మురుక్కాలవలోనికి విసిరి కొట్టింది ఆమె కసిగా.

ఇంట్లోకి వస్తూంటే తల్లి తండ్రితో అంటున్న మాటలు వినపడ్డాయి శ్రీదేవికి.

''శంకరం మంచి పిల్లవాడు, బుద్ధిమంతుడు, ఆ తల్లిదండ్రులు చేసుకున్న అదృష్టం అలాంటి పిల్లలు దొరకటం'' అని.

''నిజమే'' అన్నాడు తండ్రి.

'అవున్నిజమే. బుద్ధిమంతుడే. మహా మహా బుద్ధిమంతుడు!' అనుకుంటూ ఆమె లోపలకు వెళ్ళిపోయింది. ఆమె కళ్ళల్లో అశ్రుకణాలు తొణికిసలాడాయి.

'మయూరి' సచిత్ర వారపత్రిక
27-10-1989